సమస్యల పరిష్కారానికి వేడుకోలు

నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంతో పాటు, వివిధ వార్డు సచివాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు వివిధ సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేశారు. వీధిదీపాలు, మురుగునీటి పారుదల, రోడ్డు నిర్మాణం, నివాస స్థలాల కేటాయింపు వంటి సాధారణ సమస్యలు కూడా నెలల తరబడి పరిష్కారం కావడం లేదని, అధికారులు చొరవ చూపి శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకున్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ నందన్

పునరావృతం కాకుండా చూడాలి

నెల్లూరు(బారకాసు): ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని ఎన్‌ఎంసీ కమిషనర్ వైఓ నందన్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు వివిధ కారణాలతో బ్యాంకుల నుంచి రుణాలు అందలేదని, వారు చెల్లించిన మొత్తాలను తిరిగి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అదేవిధంగా అసంపూర్తిగా నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించనున్నామని తెలియజేశారు. రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, మార్ట్‌గేజ్ విడుదల, రోడ్లు, డ్రెయిన్ కాలువల నిర్మాణం, సివిల్ వర్కులు, వీధిదీపాల ఏర్పాటు తదితర సమస్యలను ప్రజలు తెలియజేశారన్నారు. అలాగే రెవెన్యూ విభాగం నుంచి అసెస్మెంట్ మార్పులు, నూతన ఇంటి పన్ను దరఖాస్తులు, పన్నులో మార్పులు తదితర అంశాలపై ఫిర్యాదులను అందుకున్నామన్నారు. ఇలా మొత్తం 66 ఫిర్యాదులు అందుకున్నామన్నారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి చైతన్య, సిటీ ప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, మేనేజర్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటుకు వినతి



అర్జీ ఇస్తున్న సీపీఎం రూరల్ కార్యదర్శి

నెల్లూరు(అర్బన్): స్థానిక 25వ డివిజన్ బుజబుజ నెల్లూరులో సమతానగర్, శివాజీ కాలనీ, నాగమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానికులతో కలిసి సోమవారం స్థానిక సచివాలయ వార్డు అడ్మిన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల ప్రజలు నగరంలో వివిధ పనులు చేసుకుని సాయంత్రం తరువాత ఇంటికి వస్తుంటారని, ఈ క్రమంలో చిమ్మ చీకట్లు ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే కమిషనర్‌తో మాట్లాడి వీధిదీపాలు ఏర్పాటు చేయించాలని కోరారు. సీపీఎం నేతలు కృష్ణమూర్తి, అచ్చి తిరుపాలు, వెంకయ్య, మనోజ్, రమేష్ పాల్గొన్నారు.

న్యాయం చేయండి



మాట్లాడుతున్న బాధిత కుటుంబాలు

నెల్లూరు(బారకాసు): ఇళ్లు కోల్పోయిన దళిత కుటుంబాలకు నివాస స్థలాలు కల్పించి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ ఎన్‌ఎంసీ అధికారులను కోరారు. అయ్యప్పగుడి సమీపంలో ఉన్న ఉడ్ కాంప్లెక్స్ పరిధిలో దాదాపు 30 ఏళ్ల నుంచి నివాసం ఉన్న 25 దళిత కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపించాలంటూ సీపీఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలతో కలిసి ఎన్‌ఎంసీలో కమిషనర్ నందన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పేరుతో ఖాళీ చేయించడం వల్ల దళిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దాదాపు రెండు నెలల నుంచి అధికారులకు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. వారికి నివాస స్థలాలు కేటాయించి ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ నివాస స్థలాలు ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పెంచలనరసయ్య, నరసింహారెడ్డి, శివాజీ, వెంకటేశ్వర్లు, ఝాన్సీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆంజనేయునికి సింహ వాహనసేవ



నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న హనుమజ్జయంత్యుత్సవాలు సోమవారంతో పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆంజనేయస్వామికి సోమవారం రాత్రి సింహ వాహనసేవ వేడుకగా నిర్వహించారు. విశేషాలంకారంలో కొలువైన స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తగా దూపాటి సురేష్ వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ పొట్ల రఘురామయ్య వ్యవహరించారు.

మార్కెట్లోకి ఆర్సీటీ న్యూ స్కూటర్



నెల్లూరు (టౌన్) : స్థానిక అభి సుజుకీ షోరూమ్‌లో సోమవారం సుజుకీ కంపెనీకి చెందిన ఆర్సీటీ కొత్త స్కూటర్‌ను మోటార్ వాహనాల అధికారి బాలమురళీ చేతుల మీదుగా మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూమ్ మేనేజర్లు బాబు, కమల్ మాట్లాడుతూ కొత్త మోడల్ స్కూటర్ కలర్ డిస్‌ప్లేతో ఉంటుందన్నారు. ఇందులో వాతావరణ అలర్ట్, క్యాలెండర్, డిజిటల్ వాలెట్, పగలు, రాత్రి వేళల్లో కలర్ డిస్‌ప్లేలో నోటిఫికేషన్ కనబడుతుందన్నారు. ఈ స్కూటర్ ఎక్స్ షోరూం ధర రూ.1,04,949లుగా ఉందన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన నేడు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని జెడ్పీ, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు లేదా తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులు పదోన్నతి కోసం ఈనెల 27న స్థానిక దర్గామిట్టలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగే ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని డీఈఓ బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు సేవా పుస్తకం, అర్హత ధ్రువీకరణ పత్రాలను రెండు జెరాక్స్ సెట్‌లతో హాజరుకావాలన్నారు. పదోన్నతుల కోసం హాజరయ్యే ఉపాధ్యాయుల జాబితాను www.doenellore.50webs.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

జిల్లా కమిటీని రద్దు చేశాం



నెల్లూరురూరల్: ముస్లిం నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీని పూర్తిగా రద్దు చేశామని ఈ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్‌బాషా తెలిపారు. నగరంలోని పూజితా గ్రాండ్‌లో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. తమ సంఘానికి జిల్లాలో గత 12 ఏళ్ల నుంచి ఒకే వ్యక్తి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారని, మా నూర్ బాషా సంక్షేమ సంఘం బైలాస్ ప్రకారం, ప్రతి మూడేళ్లకు ఒకసారి జిల్లా అధ్యక్షులను ఎన్నుకునే సంప్రదాయం ఉందన్నారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల అశ్రద్ధ చేశామన్నారు. దీంతో మా సంక్షేమ సంఘానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా కొన్ని పనులు జరిగాయన్నారు. మళ్లీ రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం జిల్లాలోని మండల నాయకులతో చర్చించిన తరువాత సంఘ నూతన కమిటీని ఎన్నుకుంటామన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చెత్త నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమాలు

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరురూరల్ : జిల్లాలో ప్రతి శుక్రవారం చెత్త నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ హాల్లో పీజీఆర్ఎస్ అర్జీలు, ఉపాధిహామీ, హౌసింగ్, పీఎం సూర్యఘర్ యోజన, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, యోగాంధ్ర మొదలైన అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సోమవారం సాయంత్రం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో పరిష్కరించిన సమస్యలపై అర్జీదారుల నుంచి అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. అలాగే అర్జీల ఆడిటింగ్‌ను పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఉపాధిహామీ పనుల వేగం పెంచాలని, ప్రతి వారం కనీసం 70 శాతం తగ్గకుండా పనులు జరిగేలా ఎంపీడీఓలు, ఏపీఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చాలా మండలాలు ఉపాధి పనుల కల్పనలో వెనుకబడి ఉన్నాయని, అవసరమైతే ప్రతిఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఎంపీడీఓలు ప్రతి వారం సమీక్షలు నిర్వహించాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అమెనిటీస్ సెక్రటరీలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి ఆర్సీ దశలో ఉన్న నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించడానికి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్తను తొలగించడానికి ముందు, తర్వాత ఫొటోలు తీసి సంబంధిత అధికారులకు అదేరోజు రాత్రి పంపాలన్నారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అలాగే గిరిజనులకు ఆధార్ కార్డులు మంజూరు చేసేందుకు ఈ వారం అల్లూరు, మర్రిపాడు మండలాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, దీనిపై స్థానికులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. పీఎం సూర్యఘర్ యోజన పథకంలో ప్రభుత్వ ఉద్యోగులకు కూడా సబ్సిడీ ఉంటుందని, సొంతిల్లు కలిగిన ప్రతి ఒక్కరూ పథకం ప్రయోజనాలు పొంది ఆదర్శంగా నిలవాలన్నారు.

యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములయ్యే విధంగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది మరింత మంది రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. మండల స్థాయిలో రెండు లేదా మూడు ప్రదేశాలను గుర్తించి కనీసం 50 మందితో శిక్షణ ఇచ్చే విధంగా చూడాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, మున్సిపల్ కమిషనర్ నందన్, జెడ్పీ సీఈఓ విద్యారమ, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఎస్ఈలు విజయన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ అనూష

నెల్లూరు సిటీ: నెల్లూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో జూన్ 5 నాటికి రీసర్వేను వేగంగా పూర్తి చేయాలని ఆర్డీఓ అనూష పేర్కొన్నారు. నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో వర్క్‌షాప్‌ను ఆమె సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేపై క్లెయిమ్స్‌లు, అప్పీళ్లపై సమీక్షించినట్లు తెలిపారు. ఆరు మండలాల్లో రెండో దశ రీసర్వేను చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

1న యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు కందుకూరు డివిజన్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన యాదవ విద్యార్థుల ప్రతిభా పురస్కారోత్సవం జూన్ 1న నిర్వహిస్తున్నట్లు యాదవ ఎంప్లాయీస్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. నగరంలోని పొగతోటలో ఉన్న సమతా నర్సింగ్ హోమ్‌లో కార్యవర్గ సభ్యులు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గొలగమూడి రోడ్డులోని యాదవ భవనంలో పురస్కారోత్సవం ఉంటుందన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మాదాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కొండయ్య మాట్లాడుతూ 470పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులు తమ పేర్లను 97058 00794, 95731 05305 నంబర్ల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటరాజేష్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర గౌరవ సలహాదారు గంగుల మధుసూదనరావు, మేనేజింగ్ ట్రస్టీ బొమ్మి నాగకిశోర్ పాల్గొన్నారు.

కాలుష్య రహిత నెల్లూరుకు తోడ్పడాలి



స్టోన్‌హౌస్‌పేటలో తాగునీటి సరఫరా పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగరవ్యాప్తంగా జరుగుతున్న భూగర్భ డ్రెయినేజీ ఇంటింటి కనెక్షన్లు, వాటర్ సప్లయ్ పనులను వేగవంతం చేసి, కాలుష్యరహిత నెల్లూరు నగరానికై తోడ్పడాలని కమిషనర్ నందన్ అధికారులకు సూచించారు. స్థానిక 8వ డివిజన్ నవాబుపేట, కుసుమ హరిజనవాడ, యనమల పాళెం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న భూగర్భ డ్రెయినేజీ, ఇంటింటి వాటర్ సప్లయ్ కనెక్షన్ల పనులను కమిషనర్ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నారాయణ భూగర్భ డ్రెయినేజీ కనెక్షన్లను ఒక్క రూపాయికే అందిస్తున్నామని తెలిపారు. భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ ద్వారా నగరవ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించగలమని తెలియజేశారు. అనంతరం స్థానిక ఒకటో డివిజన్ కోడూరుపాడు పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులు, డ్రెయిన్ కాలువలు, సీసీరోడ్ల నిర్మాణాలను కమిషనర్ తనిఖీ చేశారు. రెండో డివిజన్‌లోని అల్లీపురం డంపింగ్ యార్డును పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణకు కృషి



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో కుష్టువ్యాధి నివారణకు వైద్యశాఖ సిబ్బంది కృషి చేయాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలో కుష్టువ్యాధిపై సెక్టార్ల వారీగా సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రారంభ దశలో కుష్టును గుర్తిస్తే తగిన చికిత్స ద్వారా వారిని అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చన్నారు. ఎస్ఎస్ఓడీ చికిత్స ద్వారా అంగవైకల్యం వ్యాప్తి చెందకుండా కాపాడవచ్చన్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయించాలని సూచించారు. కుష్టు ఉన్నవారికి ఎంసీఆర్ చెప్పులు, ఇతర వస్తువులను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ సురేంద్రబాబు, టీహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్ సునీత, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, డీఎఫ్ఐటీ ఏఓ సతీష్, డీపీఎంఓలు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులను నిర్వర్తించండి



ట్రంకురోడ్డులో జరుగుతున్న కాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంహెచ్ఓ

నెల్లూరు(బారకాసు): పారిశుద్ధ్య సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని నగర పాలక ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ చైతన్య అన్నారు. స్థానిక ట్రంక్‌రోడ్డు వద్ద జరుగుతున్న పూడికతీత పనులను ఆయన సోమవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో మురుగు పారుదలకు అనువుగా పూడికతీత చేపట్టాలని తెలిపారు. అలాగే కొరడావీధి, కామాటి వీధి ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలను పర్యవేక్షించారు. స్థానికంగా చెత్త సేకరణకు రెండు ఆటోలను పంపాలని సూచించారు. కాలువల్లో వ్యర్థాలను వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

మహానాడులో కోవిడ్ నిబంధనలు పాటించాలి

నెల్లూరు(అర్బన్): ఈనెల 29న టీడీపీ నిర్వహించే మహానాడులో కోవిడ్ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్వీ రమణయ్య, టి.కామేశ్వరరావు కోరారు. ఈ మేరకు అమరావతిలోని సీఎం కార్యాలయానికి వారు సోమవారం అర్జీ పంపారు. ఈ సందర్భంగా నెల్లూరులో ఎమ్వీ రమణయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మళ్లీ కరోనా కేసులు పెరిగాయన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో పార్టీ సభలు, ప్రార్థనా సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించరాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిబంధనలు రూపొందించాయన్నారు. అయితే జారీ చేసిన పెద్దలే కడపలో భారీ ఎత్తున జనసమీకరణతో సభలు నిర్వహిస్తుండటం బాధాకరమన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

నెల్లూరు సిటీ: రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు రూరల్ పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ క్రమంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ.17 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరిచారు.

పౌష్టికాహారం అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేశారు. దాత నందిమండలం సుబ్బరాజు, భానుశ్రీ, పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు చింతల అమరేందర్‌రెడ్డి, పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపినాథ్ రాఘవేంద్రశెట్టి, డీవీ సుబ్బరాజు, చంద్రమౌళి, నాగేశ్వరరావు, రాజా రమేష్, విజయమోహన్‌నాయుడు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి



ఆత్మకూరు బస్టాండ్ వద్ద..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని సీపీఎం జిల్లా, నగర కార్యదర్శులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు అన్నారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సమైక్యత యాత్రలను నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతం పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, దీనిని ప్రతిఒక్కరూ ఖండించినట్లు గుర్తుచేశారు. అయితే బీజేపీ నాయకులు ఉగ్రవాదానికి మతం రంగు పులిమి మత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం నగరంలోని పప్పులవీధి, స్టోన్‌హౌస్‌పేట, శెట్టిగుంట రోడ్డు, భగత్‌సింగ్‌కాలనీ, జనార్దనరెడ్డి కాలనీ, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో యాత్ర సాగింది. వామపక్ష నేతలు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, సూర్యనారాయణ, శ్రీనివాసులు, రషీద్, నరసింహ, మూలం ప్రసాద్, శివకుమారి, గడ్డం శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుళాయి పన్నులను వసూలు చేయండి



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగరంలోని అన్ని డివిజన్లలో తాగునీటి కుళాయి పన్నులను విధిగా వసూలు చేయాలని అధికారులు, సచివాలయ కార్యదర్శులను కమిషనర్ నందన్ ఆదేశించారు. ఎన్‌ఎంసీ కార్యాలయ కమాండ్ సెంటర్‌లో వారాంతపు సమీక్షలో భాగంగా ఇంజినీరింగ్ విభాగం సిబ్బందితో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అలసత్వం వీడి చురుగ్గా పనిచేసి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. సచివాలయ పరిధిలో తాగునీటి కుళాయి కనెక్షన్లు, విద్యుద్దీపాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, నగరపాలక సంస్థ హౌసింగ్ విభాగాల ఈఈలు, డీఈఈలు, ఏఈలు, వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాకాణికి మద్దతుగా..

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అక్రమ అరెస్ట్ నేపథ్యంలో సర్వేపల్లి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వారి ఖండనలు తెలిపారు. ఈ క్రమంలో వెంకటగిరిలోని కోర్టు వద్దకు, జిల్లా కేంద్ర కారాగారానికి భారీగా పార్టీ శ్రేణులు తరలి వెళ్లి తమ మద్దతు తెలిపారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్ నెల్లూరు



వెంకటగిరి కోర్టు వద్దకు భారీగా చేరిన పార్టీ శ్రేణులు

వెంకటగిరి కోర్టు వద్ద పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి







నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారం వద్ద..